# కథ అడ్డం తిరిగింది

ఆ ఉత్తరం రాకపోయి ఉంటే మా ఇద్దరిలో ఏకాభిప్రాయం అనేది ఎప్పటికీ ఉండేది కాదేమో! మా జాతకాలు దివ్యంగా కలిసాయన్న మహానుభావుడెవరో మా పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. జాతకాలు కలవడం తప్ప మా ఇద్దరి బుర్రలూ ఏనాడూ కలవలేదు.

నేను ఎడ్డెం అంటే ఆమె తెడ్డెం అనేది. నానా గడ్డీ కరిచి కొంపలో అన్నీ అమరుస్తున్నా తన పుట్టిల్లే స్వర్గం అంటుంది. వాళ్ళమ్మ మిస్ వరల్డ్ అయితే ఈవిడగారు మిస్ యూనివర్సట. పనీపాటా లేక అడ్డగాడిదలా తిరిగే తమ్ముడు మహాబుద్ధిమంతుడు, బ్రతకనేర్చినవాడట. వంట కూడా ఇప్పటికీ వాళ్ళమ్మనడిగే చేస్తుంది. వారానికో సారి ఫోన్‌చేసి, ఆ వారంలో వండాల్సిన వంటల లిస్ట్ వాళ్ళమ్మనడిగి తెలుసుకుంటుంది. ఆవిడ చెబుతుంది, ఈవిడ చేస్తుంది. అంతే... ఎలా ఉన్నా తినకతప్పదు.



మా ఇద్దరికీ అసలు పడకపోవడమనేది పరోక్షంగా దేశానికి ఎంతో తోడ్పడింది. మాకు తెలియకుండానే నిర్బంధ కుటుంబ నియంత్రణ పాటిస్తూ జనాభా పెరగ

వై.కె. మూర్తి

కుండా చూస్తున్నాం. కొడుకు కావాలని నేను, కూతుర్ని కనాలని మా ఆవిడా పోట్లాడుకుని, నెలల తరబడి మాట్లాడుకునే వాళ్ళం కాదు. నా మాటగెలవనీయలేదు కనుక విజయం తనదేనని గర్వపడేది. అసలు వాళ్ళ కొంపలో కూడా వాళ్ళమ్మదే గెలుపని ఊరంతా చెప్పుకునేవాళ్ళు. అలాంటిది ఒక ఉత్తరం మా ఇద్దరి మధ్యా ఏకాభిప్రాయం కుదిర్చింది.

ఆ ఉత్తరం రాసింది మా నాన్న పిన్ని కొడుకు మేనత్త తాతగారు. ఆయన మరోవైపు నుంచి నా భార్య మేనత్త కొడుకు చినమామగారి బావమరిది పెదతండ్రి మామగారు. నా అడ్రస్ ఆ శాల్తీకి ఎలా దొరికిందోగానీ ఉత్తరం రాసిపారేసాడు. తాను కుటుంబ సమేతంగా విజయవాడ వస్తున్నట్టు, ఓ వారం రోజులుండి మా ముచ్చటైన సంసారాన్ని కళ్ళారా చూసి తరించనున్నట్టూ రాసాడు.

అది చదివి, గుండె బేజారై ఉత్తరం మా ఆవిడ చేతిలో పెట్టా. ఒక్క క్షణంపాటు నా మీద విజయం సాధించే ఉద్దేశ్యంతో ఆనందం కనబరిచినా రెండో క్షణంలో మాత్రం ఆవిడగారి ముఖం మాడినమసిబొగ్గు అయింది. ఆయనతో పాటు వచ్చే పటాలానికి వండి వార్చేసరికి నడుములు పడిపోతాయన్న సంగతి అర్థమై తిట్లు లంకించుకుంది. ఆ దిక్కుమాలిన మాయదారి సంతకి మా ఇల్లే దొరకాలా అని వాపోయింది. రాబోయే ముప్పును ఎలా ఎదుర్కోవాలా అన్న చింత మా ఇద్దర్నీ ఒకటి చేసింది. నా బుర్రకు ఏ ఉపాయం తోచలేదు. నానా తర్జనభర్జనలూ పడి మొత్తానికి ఓ ఉపాయం కనిపెట్టాం. జీవితంలో మొట్టమొదటిసారిగా మా ఆవిడ తెలివిగా మాట్లాడింది.

'వాళ్ళు ఇంట్లోకి వచ్చిన గంటలోనే మనిద్దరం గొడవపడదాం. మీరు నన్ను చాచిలెంపకాయ కొట్టండి' అంది. నేను మనసులోనే ఆనందపడ్డాను. జీవితంలో మొట్టమొదటిసారిగా మా ఆవిడ చెంప చెళ్ళుమనిపించే అవకాశం దక్కుతోంది.

'అప్పుడు నేనేం చేస్తానంటే కోపం వచ్చి మా పుట్టింటికి వెళ్ళిపోతానన్నమాట. మీరు నన్ను బ్రతిమలాడుతూ నా వెనకవస్తారు. దాంతో దిక్కుతోచక వాళ్ళు వెళ్ళిపోతారు' అంది.

మరనాడు ఉదయమే ఆ పటాలం మొత్తం మా ఇంట్లో దిగిపోయింది. ఆ పటాలంలోని పిల్లమూక కుర్చీలపై, సోఫాలపై, కిటికీలపై ఎక్కేస్తున్నారు. ఒకరిద్దరు నా చుట్టూ చేరి కథక్ డాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నారు.

మా నాటకం ఎప్పుడు మొదలవుతుందా, ఎప్పుడు వీళ్ళ పీడవిరగడవుతుందా అని ఎదురుచూస్తూ కూర్చున్నాను. మా ఆవిడ వచ్చిన వాళ్లకు కాఫీలు ఇచ్చింది. నాకూ కప్పు అందిస్తూ కావాలనే కప్పు జారవిడిచింది. నా ఫాంటు మీద మోడర్న్ ఆర్ట్‌లా పెద్ద మరక పడింది. అయినా నేను నోరు మూసుకున్నాను. కింద పడిపగిలిపోయిన కప్పు ఎత్తుతూ మా ఆవిడ నాకేసి చూసి కన్ను గీటింది. అదేం సిగ్నలో నాకు అర్థంకాలేదు. మా ఆవిడ ఇక నాటకం తానే మొదలుపెట్టింది.

'ఓవైపు ఇంట్లో చుట్టాలందరూ వస్తే కాళ్ళు అడ్డం పెట్టుకుని కూర్చుంటారేం' అని అరిచింది.

'మరెలా కూర్చోమంటావ్ నువ్వే చెప్పు' అన్నాను పెద్దగా.

'ఎందుకలా నోరుపారేసుకుంటారు? ఎవ

బొద్దింక తల పోయినా
అది కొన్ని వారాలు బ్రతికే ఉంటుంది

రైనా వచ్చినప్పుడు నెమ్మదిగా మాట్లాడమని చెప్పానా! మీకే ఉందికదాని పెద్ద గొంతేసుకుని అరుస్తారేం?' అని అరిచింది. నా బుర్రలో అప్పుడు లైటు వెలిగింది. 'అరవొద్దు అంటూ నువ్వు అరుస్తావేం బుద్ధుందా నీకు?'

'అసలు బుద్ధి మీకుందా అని అడుగుతున్నాను. పోయి పోయి బుద్ధిలేనివాడికి మా నాన్న నన్ను కట్టబెట్టాడు'.

'అసలు మీవాళ్ళకు బుద్ధుందా అని అడుగుతున్నాను. వాళ్ళకు బుద్ధుంటే నీకు బుద్ధి చెప్పేవాళ్ళు'.

'మా వాళ్ళ గురించి మాటజారితే మర్యాద దక్కదు జాగ్రత్త'.

'ఏం చేస్తావేం – కొడతావా? చుట్టాలున్నా కూడా కొడతావా?' కోపంతో రెచ్చిపోయాను.

'కొడతానో నరుకుతానో నాకే తెలియదు. కోపం వస్తే నేను కాళికను. జాగ్రత్త!'

'నేనూ అంతే... కోపం వస్తే రుద్రతాండవం చేస్తా, ఖబడ్దార్!'

'మీ బోడి పర్సనాలిటీకి అంత పౌరుషం కూడానా? నన్ను కొట్టే దమ్ముందా?'

'ఏయ్' అని అరుస్తూ చెయ్యెత్తాను. కానీ కొట్టేందుకు ధైర్యం చాలలేదు. మా ఆవిడ కన్ను కొట్టింది. అంతే... ధైర్యం తెచ్చుకుని కళ్ళు మూసు కుని ఆమె చెంప చెళ్ళుమనిపించాను.

అంతే... ఆమడ దూరం వినిపించేలా పెద్ద గొంతేసుకుని భోరున ఏడవడం మొదలు పెట్టింది. రెండు చేతులతో గుండెలు బాదుకుంటూ ఏడ్చింది.

'ఇంత అవమానం జరిగాక నేనుండను. మా పుట్టింటికి వెళ్ళిపోతా' అంది రాగాలు తీస్తూ.

'పో... ఇప్పుడే పో... ఒక్క క్షణం ఉండాల్సిన అవసరం లేదు' అన్నాను అరుస్తూ.

'పోతా... ఇప్పుడేపోతా? మీరు బ్రతిమలాడినా ఉండను' అంది ముక్కుచీదుతూ. రయ్యిన బెడ్రూంలోకి వెళ్ళిపోయి, బట్టలు సర్దుకోవడం మొదలు పెట్టింది.

మా ప్లాన్ సక్సెస్ అవుతున్న సూచనలు కనిపించాయి. చుట్టాలందరూ వెర్రిముఖాలు వేసుకుని మాకేసి చూస్తున్నారు. నాటకాన్ని మరింత రక్తి కట్టించాలని బెడ్రూంవైపు దూసుకుపోయాను.

'ఏమనుకుంటున్నావే... నువ్వు లేకపోతే బతకలేననుకుంటున్నావా? అంత పొగరా? తక్షణమే నా కొంపలోంచి వెళ్ళిపో... అని అరిచాను. మా ఆవిడ సూట్‌కేస్‌తో బయటికి వస్తూంటే పటాలంలోని ఆడవాళ్ళు ఆమెను అడ్డుకున్నారు.

అంతే... పటాలంలోని ఒక పెద్దాయన, మరొక పెద్దావిడ మమ్మల్ని కూర్చోబెట్టి బ్రెయిన్ వాష్ చేయడం మొదలుపెట్టారు. నేను ససేమిరా అన్నాను. మా ఆవిడా ససేమిరా అంది.

'ఇలా లాభం లేదు. వీళ్ళిద్దరికీ రాజీ కుదిరే వరకూ మనం ఈ ఇల్లు వదిలి వెళ్ళే ప్రసక్తే లేదు. ఇలా గొడవలు పడుతూంటే చూస్తూ ఊరుకుంటామా?' అన్నాడు పెద్దాయన.

'చూడబ్బాయ్, మీరిద్దరూ చిలకాగోరింకల్లా కలిసిపోవాలి. అంతవరకూ మేము ఊరికి తిరిగి వెళ్ళేదే లేదు" అంది పెద్దావిడలోనికి వెళ్తూ.

దబ్బున పెద్ద శబ్దం వినిపించి బెడ్రూంలోకి పరిగెత్తాను. మా ఆవిడ కళ్ళు తిరిగి పడిపోయింది. ●